

ఎల్బీనగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు : కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, జనవరి 31 : ఎల్బీనగర్ నియోజకవర్గంలోని సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శశాంక తెలిపారు. ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని స్థానిక సమస్యలపై బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలను తీసుకోవాలని సుధీర్‌రెడ్డి కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం, కందుకూరు ఆర్డీవోలు అనంతరెడ్డి, సూరజ్‌కుమార్, తహసీల్దార్లు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నేడు పార్లమెంట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న కేంద్ర తాత్కాలిక బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా వాసులు అనేక ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా కొత్త రైల్వేలైన్లు, ఎంఎంటీఎస్‌ల పొడిగింపు, బుల్లెట్ రైల్ మార్గాలకు నిధుల కేటాయింపు జరుగుతుందని ఆశిస్తున్నారు. అయితే, వీటికి కేంద్రం ఏ మేరకు సహకరించి నిధులు కేటాయిస్తుందోనన్న ఉత్కంఠ ఇక్కడి ప్రజల్లో నెలకొంది. ఎంఎంటీఎస్ రైళ్ల పొడిగింపు డిమాండ్ ఎన్నో ఏళ్లుగా వస్తున్నా కేంద్రం కనికరించడం లేదు. కనీసం ఈ సారైనా ఉమ్మడి జిల్లావాసుల ఆశలను నెరవేరుస్తుందో.. లేదో చూడాలి.

రెండు బుల్లెట్ రైళ్ల మార్గాలకు నిధులు కేటాయించేనా?

- శంషాబాద్ మెట్రోకు కేంద్రం సహకరించేనా?
- కలగా మారిన ఎంఎంటీఎస్ సేవల పొడిగింపు..
- వికారాబాద్- కృష్ణ రైల్వే పనులకు మోక్షం కలిగేనా?
- హైదరాబాద్- శ్రీశైలం రైలు మార్గంపై గంపెడాశలు



ఆకాంక్షలు ఫలించేనా!

కేంద్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసుల ఆశలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

కేంద్ర ప్రభుత్వం నేడు ప్రవేశ పెట్టనున్న తాత్కాలిక బడ్జెట్‌లో సంక్షేమ కార్యక్రమాలతో పాటు రైల్వే పరంగా ఉమ్మడి జిల్లాకు ఈ సారైనా వరాలు కురుస్తాయని ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. హైదరాబాద్ నుంచి ముంబై, హైదరాబాద్ నుంచి బెంగుళూరు వరకు బుల్లెట్ రైళ్ల నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. ఈ రెండు హైస్పీడ్ రైళ్ల కారిడార్ పనులు మొదలైతే మహానగరాల మధ్య రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుంది. ముంబై నుంచి హైదరాబాద్ వరకు శరవేగంగా రాకపోకలు కొనసాగించేందుకు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్) ప్రతిపాదించిన ముంబై - హైదరాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. పర్యావరణ, సామాజిక అనుమతులు పొందడానికి ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ పూర్తి చేశారు. హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన అలైన్‌మెంట్ పనులు చేపట్టేందుకు సిద్ధమైన సమయంలో పనులు నిలిచిపోయాయి. హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ తయారీ బాధ్యతలను రైల్వే మంత్రిత్వ శాఖ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అప్పగించింది. రూ.లక్ష కోట్ల వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించగా, కేంద్ర ప్రభుత్వం ఈసారైనా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందనే ఆశతో జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. అలాగే హైదరాబాద్- ముంబై బుల్లెట్ రైలు నిర్మాణ పనులపై కూడా సందిగ్ధత నెలకొంది. ఇక అనేక సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఎంఎంటీఎస్ సేవల పొడిగింపునకు ఈ సారైనా మోక్షం కలగకపోతుందా అన్న ఆశతో జనం ఉన్నారు. లింగంపల్లి నుంచి వికారాబాద్, తాండూరు వరకు ఎంఎంటీఎస్ రైలు పొడిగించాలని ఆ ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఎంఎంటీఎస్ సదుపాయం కల్పించాలంటూ 15 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీ, రైల్వే ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నారు. ఈసారి కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో వికారాబాద్, తాండూరు మీదుగా కొత్తగా రైళ్లు నడిపించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తుందనే గంపెడాశతో ఉన్నారు. ప్రస్తుతం జిల్లా మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్న రైళ్లు కిక్కిరిసి నడుస్తున్నాయి. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా కొత్త రైళ్లు ప్రవేశ పెట్టడంతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న రైళ్లకు అదనంగా బోగీలు వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అన్ని రైళ్లు తాండూరు, వికారాబాద్‌లో కూడా ఆగే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఫైనల్ లొకేషన్ సర్వే...

ఎంతో కాలంగా ఊరిస్తూ వచ్చిన వికారాబాద్- కృష్ణ రైల్వే మార్గంలో ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) పనులు కొనసాగుతున్నాయి. వికారాబాద్ నుంచి కృష్ణ వరకు 122 కిలోమీటర్ల దూరం రైల్వేలైన్ నిర్మాణానికి రూ.2,196 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. వికారాబాద్ - కృష్ణ రైల్వేలైన్ కోసం మూడున్నర దశాబ్దాలుగా ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఫైనల్ లొకేషన్ సర్వే పనులు పూర్తి కాగానే వికారాబాద్- కృష్ణ రైల్వే లైన్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ లభించనుంది. ఈ మార్గం పూర్తయితే పరిగి, కొడంగల్, హస్నాబాద్, దౌల్తాబాద్, మక్తల్, నారాయణపేట్ మీదుగా సుమారు 40 ప్రాంతాలకు రైలు ప్రయాణం సదుపాయం కలగనుంది.

హైదరాబాద్- శ్రీశైలం రూట్‌కు మోక్షం కలిగేనా?

ఇదిలా ఉంటే హైదరాబాద్- శ్రీశైలం వయా అచ్చంపేట వరకు 171 కి.మీ మేర రైలు మార్గానికి గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. వీటిపై కేంద్రం ఇంత వరకు ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. ఈ ప్రాజెక్టుకు మొండిచేయి చూపింది. ఈ ప్రాజెక్టు చేపడితే జిల్లాలోని పలు మండలాల ప్రజలకు ప్రయోజనం కలగనుంది.

శంషాబాద్ వరకు మెట్రో విస్తరణకు నిధులిచ్చేనా?

శంషాబాద్ వరకు మెట్రో రైల్ విస్తరణ పనులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం గచ్చిబౌలిలో శంకుస్థాపన చేసింది. కేంద్రం నిధులు ఇవ్వకున్నా రాష్ట్ర ప్రభుత్వమే దీన్ని నిర్మించాలని నిర్ణయించింది. అయితే ఇపుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ ప్రాజెక్టును రద్దు చేసింది. గచ్చిబౌలి నుంచి కాకుండా ఎల్బీనగర్, ఓల్డ్‌సిటీ మీదుగా శంషాబాద్ వరకు మెట్రో వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే దీని నిర్మాణ విషయంలో నిధుల సేకరణ ఎలా అనేది ఇంకా రాష్ట్ర ప్రభుత్వం తేల్చలేదు. మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం సహాయం కోరుతోంది. ఇపుడు మారిన మెట్రో విస్తరణ పనులకు కేంద్రం ఎంత వరకు సహాయ సహకారాలు ఇస్తుందో వేచి చూడాలి.



స్కూల్ ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న బృందం సభ్యులు

మహేశ్వరం మోడల్‌స్కూల్‌లో విద్యా విధానం బాగుంది

- విజన్ భారత్, లండన్ ప్రతినిధుల బృందం కితాబు

మహేశ్వరం, జనవరి 31 : మహేశ్వరం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యా విధానం బాగుందని విజన్ భారత్ సంస్థ, లండన్‌కు చెందిన ప్రతినిధుల బృందం కితాబునిచ్చింది. ఈ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవడం ఎంతో అభినందనీయమని బృందం సభ్యులు అంజునిరంజన్, నీనా ప్రిన్స్‌లు అన్నారు. బుధవారం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మహేశ్వరం మోడల్ స్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అనంతరం లండన్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుండే విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అలాగే ఉన్న ఊరికి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యం

- ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి



కడ్తాలలో మల్లు రవిని సన్మానిస్తున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి అన్నారు. కేంద్రంలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులంతా కార్యోన్ముఖులై సమష్టిగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన మల్లు రవికి బుధవారం కడ్తాల, ఆమనగల్లు మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులు భారీగా హాజరై మల్లుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం అంబేద్కర్, రాజీవ్‌గాంధీ విగ్రహాలకు మల్లు రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమనగల్లులో జాతీయ రహదారిపై ర్యాలీగా రాజీవ్ చౌరస్తా వద్దకు చేరుకుని సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పార్లమెంట్ బరిలో మల్లు రవి నిలవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు చేతులెత్తి నినాదాలు చేస్తూ సంఘీభావం తెలిపారు. అనంతరం మల్లు మాట్లాడుతూ ప్రజాభీష్టం మేరకు పార్టీ ఆదేశిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో నిలబడుతానని ప్రకటించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, రాహుల్ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో అధికారాన్ని నిలబెట్టుకోవడానికి బీజేపీ మత రాజకీయాలు, కుట్రలు సాగిస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్‌తోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశ, దోపిడీ పాలనను ప్రజలు తిరస్కరించి కుటుంబపాలనను అంతమొందించారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్యనాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఎంపీపీలు కమ్లీ మోత్యనాయక్, అనితావిజయ్, పార్టీ ఆమనగల్లు మండలాధ్యక్షుడు జగన్, జిల్లా నాయకులు గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, గూడూరు భాస్కర్‌రెడ్డి, హన్మనాయక్, మండ్లి రాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

జలశక్తి అభియాన్ డిప్యూటీ సెక్రటరీ అమిత్‌మిశ్రా

మంచాల, జనవరి31: వాననీటిని ఒడిసిపట్టి భవిష్యత్తు తరాలను సంక్షోభాల నుంచి సంరక్షించుకోవాలని, నీటి సంరక్షణకు ప్రతీఒక్కరు ప్రాధాన్యమివ్వాలని జలశక్తి అభియాన్ సెంట్రల్ డిప్యూటీ సెక్రటరీ అమిత్ మిశ్రా అన్నారు. జలశక్తి అభియాన్ కేంద్ర బృందం బుధవారం మంచాల మండలంలో పర్యటించి వర్షాధార నీటి నిల్వ కుంటల పనులను పరిశీలించారు. ఈసందర్భంగా అమిత్ మిశ్రా మాట్లాడుతూ నీటినిల్వను పెంపొందించే దిశగా వ్యక్తిగత ఇంకుడుగుంతలు, సామాజిక ఇంకుడుగుంతలు, బోరుబావి ఇంకుడుగుంతలు, చెక్‌డ్యాంలు తదితర పనులను వేగవంతం చేయాలని, గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్య తలెత్తకుండా ఉంటుందని తెలిపారు. హరితహారంలో భాగంగా రోడ్లకిరువైపులా మొక్కలు నాటడంతో పాటు కమ్యూనిటీ, వ్యక్తిగత మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త అంకిత్ విశ్వకర్మ, జిల్లా గ్రామీణాభివృద్ధి అడిషనల్ అధికారి నీరజ, క్లస్టర్ అధికారి సక్రునాయక్, ఏపీవో వీరాంజనేయులు, శ్వేత, విమలప్రభాకర్, యాదయ్య, మహేష్ పాల్గొన్నారు.



- కెమికల్స్, పరికరాలు లేకుండానే ప్రాక్టికల్స్
- ప్రైవేట్ కళాశాలల్లోనూ అదేతీరు
- నేటి నుంచి ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు రసాయనాల కొరత!

మూడేళ్లుగా కాలేజీలకు నిలిచిన సరఫరా

చేవెళ్ల, జనవరి 31 : విద్యార్థుల అభ్యున్నతి శాస్త్రీయ విద్య కావాలి. అందుకోసం పరిశోధనాత్మక చదువులు అవసరం. దానికి ఇంటర్మీడియట్ కీలకం. అందుకే ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు తరగతి గదుల్లో బోధించిన పాఠాలను ప్రాక్టికల్‌గా చేసేందుకు జూనియర్ కాలేజీల్లో ప్రయోగశాలలు ఉంటాయి. అక్కడ అధ్యాపకులు విద్యార్థులతో ప్రయోగాలు చేయించి శిక్షణ ఇస్తారు. ఆ ప్రయోగాల ఆధారంగానే ద్వితీయ సంవత్సరం మార్కులు కూడా వేస్తారు. ఈ మార్కులు కూడా విద్యార్థులకు కీలకమే. కానీ ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఈ ప్రయోగాలు మొక్కుబడిగా మారాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో ల్యాబ్‌ల్లో సరైన పరికరాలు, రసాయనాలు అందుబాటులో లేకపోవడంతో ప్రాక్టికల్స్‌లో నిర్లక్ష్యం కొనసాగుతోంది.

నేటి నుంచే ప్రాక్టికల్స్..

నేటి నుంచి ప్రాక్టికల్స్ నిర్వహణకు ఇంటర్‌బోర్డు సిద్ధమైంది. కానీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మూడు సంవత్సరాలుగా రసాయనాలు, పరికరాలు సరఫరా కావడం లేదు. దీంతో విద్యార్థులకు, అధ్యాపకులకు ప్రాక్టికల్సే అసలు పరీక్షగా మారాయి. ఇందుకు అవసరమైన రసాయనాలు, పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ కళాశాలల్లో పాత వాటితోనే మమ అనిపించబోతున్నారు. ఈ విషయంపై పలువురు ప్రిన్సిపాళ్ళు ఇంటర్‌బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

ఎప్పటికీ గుర్తుండేలా....

పాఠాలు చెప్పాక అదే రోజు ల్యాబ్‌ల్లో ప్రయోగాలు చేయించడం వల్ల అవి ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఇందు కోసమే ఆయా కళాశాలల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ఇన్‌చార్జిలను కూడా నియమిస్తారు. కానీ కొన్ని కళాశాలల్లో ఎలాంటి రసాయనాలు, పరికరాలు లేకుండానే, ప్రయోగాలు చేయకుండానే పాఠాలనే ల్యాబ్‌లలో రివైజ్ చేస్తున్నారు. మరి కొన్ని కాలేజీల్లో ల్యాబ్‌ల తలుపులే తీయడం లేదు. కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో అసలు ల్యాబ్‌లే లేవు.



చేవెళ్ల జూనియర్ కళాశాలలో అరకొరగా ఉన్న ప్రాక్టికల్స్ పరికరాలు

ఒకేషనల్ కోర్సులదీ అదే పరిస్థితి....

ఇంటర్‌లో ఒకేషనల్ (వృత్తివిద్య) కోర్సులను కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశపెట్టారు. ఎక్కువగా ఎంఎల్‌టీ, (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్), సీటీ (కాంక్రీట్ టెక్నీషియన్) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సు చదివే విద్యార్థులకు ప్రాక్టికల్స్ చాలా అవసరం. కానీ ఈ కోర్సులకు సంబంధించిన ల్యాబ్‌ల్లో కూడా రసాయనాలు, పరికరాలు అందుబాటులో ఉండటం లేదు. ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులో మైక్రోస్కోప్, హిమోగ్లోబిన్ మీటర్లు, స్పాటలర్ ఐడెంటిఫికేషన్లు, సెంట్రీఫ్యూజ్ వంటి వస్తువులతో పాటు రసాయనాలు కూడా అవసరం, సీటీ కోర్సుల్లో కూడా చెయిన్లు, సిమెంట్, ఇసుక, ప్లంబింగ్‌కు సంబంధించిన పరికరాలు అందుబాటులో లేవు. ఈ కారణంగానే వృత్తివిద్యా కోర్సు చదువుతున్న వారిలో నైపుణ్యాలు పెరగడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నాం

ల్యాబ్‌ల నిర్వహణకు అవసరమైన రసాయనాలు, ఇతర సామగ్రి కొనుగోలుకు కొంతకాలంగా ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. కళాశాల అవసరాల గురించి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నాం. ప్రయోగాలకు అవసరమైన రసాయనాలను ఉన్నదాంట్లోనే సర్దుకుంటూ విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయిస్తున్నాం. అవసరమైన రసాయనాలు ఇతర సామగ్రిని ప్రభుత్వ ఉన్నతాధికారులు అందిస్తారని భావిస్తున్నాం.

- అనురాధ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, చేవెళ్ల



కడ్తాలలో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ఎన్ఐఆర్‌డీ బృందం

కడ్తాల గ్రామాభివృద్ధి ప్రణాళిక భేష్

- ఎన్ఐఆర్‌డీ బృందం కితాబు
- అభివృద్ధి పనుల పరిశీలన

కడ్తాల్, జనవరి 31: గ్రామాభివృద్ధికి కడ్తాల గ్రామపంచాయతీ రూపొందించి అమలు పరిచిన ప్రణాళిక ఇతర పంచాయతీలకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఎన్ఐఆర్‌డీ పీఆర్ బృందం కితాబునిచ్చింది. ప్రజల మౌలిక వసతుల కల్పనకు చేపట్టిన అభివృద్ధి పనులను బృందం అభినందించింది. కడ్తాల గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ నాగాలాండ్, మిజోరాం, బీహార్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, జమ్మూకశ్మీర్ తదితర రాష్ట్రాలకు చెందిన ప్రతినిధుల బృందం సభ్యులు బుద్ధ చంద్రసింగ్, రతన్‌రాజు, నారాయణ మాలిక్, శ్రీతం కల్తా, కుమార్ శుభం, ఉపేందర్ బుధవారం మండలంలో పర్యటించారు. ప్రాజెక్టు టీం లీడర్ దిలీప్ కుమార్‌పాల్ ఆధ్వర్యంలోని 50మంది యువ ప్రతినిధులు, ఆదర్శ గ్రామపంచాయతీల శిక్షకులు కడ్తాల పట్టణంలో పర్యటించి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ గూడూరు లక్ష్మి నర్సింహారెడ్డితో కలిసి నర్సరీ, పల్లె ప్రకృతి వనం, రైతు వేదిక, వైకుంఠ ధామం, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ తీరు, స్వయం సహాయక సంఘాల పనితీరును పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో పాలకవర్గంతో సమావేశమయ్యారు. గ్రామపంచాయతీ సొంత ఆదాయ వనరుల సమకూర్పు, వ్యయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా చేపడుతున్న పనులు, అందుతున్న నిధులపై ఆరా తీశారు. రైతులకు, స్వయం సంఘాలకు, విద్య, వైద్యానికి గ్రామపంచాయతీల నుండి లభిస్తున్న సహకారాన్ని తెలుసుకున్నారు. కడ్తాల పంచాయతీ అభివృద్ధికి చేపట్టిన విధానంపై ప్రశంసించారు. కడ్తాల్‌ను ఆదర్శంగా తీసుకొని తమ రాష్ట్రాల్లోని గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో గణేశ్, రాంచంద్రయ్య, లాయక్ అలీ, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్, జనవరి 31 : అవిశ్వాస తీర్మాన భయం మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్‌చైర్మన్లను వెంటాడుతోంది. మునిసిపాలిటీల పాలకవర్గాలు కొలువుదీరి నాలుగేళ్లు పూర్తికావడంతో నిబంధనల మేరకు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టే వీలు ఉంటుంది. దీంతో చాలా మునిసిలిపాలిటీల్లో సభ్యులు అవిశ్వాసాలపై దృష్టిసారించారు. రాష్ట్రంలో ఇప్పటికే పలు మున్సిపాలిటీల్లో అవిశ్వాస నోటీసులు ఇచ్చారు. అలాగే కొన్ని అవిశ్వాస తీర్మానాలు నెగ్గి చైర్‌పర్సన్లు పదవిని కోల్పోయారు కూడా! దీంతో ఎవరి జాగ్రత్తల్లో వారు నిమగ్నమయ్యారు. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యుల్లో కొందరు తమ మునిసిపాలిటీల్లోనూ అవిశ్వాసంపై చర్చించడం ప్రారంభించారు. దీంతో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీలో 18 మంది కౌన్సిలర్లు ఉండగా వారిలో ఒకరు కాంగ్రెస్, మరొకరు బీజేపీ సభ్యులు. మిగిలిన 16 మంది కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌కు చెందినవారే. సొంతపార్టీ వారే అసమ్మతి రాగం వినిపిస్తుండటంతో మరో ఏడాది పాటు పదవిలో ఉండాలంటే కౌన్సిలర్లను బుజ్జగించే కార్యక్రమంలో భాగంగా చైర్మన్, వైస్‌చైర్మన్ సహా 13 మంది కౌన్సిలర్లు గోవా రాష్ట్రంలో విహారయాత్రకు వెళ్లారు. వారిలో బీజేపీ సభ్యుడు, బీఆర్‌ఎస్‌కు చెందిన 13 మంది సభ్యులున్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్, ఒక బీఆర్‌ఎస్ కౌన్సిలర్ విహారయాత్రకు దూరంగా ఉన్నారు. చైర్మన్ వర్గానికే చెందిన మరో కౌన్సిలర్ వ్యక్తిగత కారణలతో వెళ్లనట్టు తెలుస్తోంది. మొత్తానికి 15 మంది కౌన్సిలర్లు మూడు రోజులుగా గోవాలో విహరిస్తున్నారు. మెజారిటీ సభ్యులు తన వెంటే ఉన్నందున అవిశ్వాసం సాధ్యం కాదనే ధీమాలో చైర్‌పర్సన్ ఉన్నారు. అయితే బేరసారాల్లో విభేదాలు తలెత్తితే పరిస్థితి మొదటికి రాకపోదనే చర్చలు సాగుతున్నాయి. ఒక్క సంవత్సరమే పదవీ కాలం ఉండడంతో భారీగా తాయిలాలు ఇచ్చి చైర్మన్ పదవికి ఎవరు ప్రయత్నిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గోవా టూర్‌తో అవిశ్వాసం సమసిపోతుందా? లేక తిరగబడుతుందా? అనేది త్వరలోనే తేలనుంది.

గోవా టూర్‌లో పోచారం మునిసిపల్ పాలకవర్గం

● 'అవిశ్వాస' సమస్య పరిష్కారానికే అని ప్రచారం

ఉద్యోగ విరమణ మధురానుభూతులు మిగులుస్తుంది



మల్లేశం దంపతులను సన్మానిస్తున్న చైర్‌పర్సన్, నాయకులు

వికారాబాద్, జనవరి 31 : ఉద్యోగ విరమణ అనే ప్రతీ ఉద్యోగి జీవితంలో మధురానుభూతులను మిగులుస్తుందని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. బుధవారం వికారాబాద్‌లో గల జిల్లా పరిషత్ పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్ భగిరి మల్లేశం రిటైర్మెంట్ కార్యక్రమానికి చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లేశం దంపతులను సన్మానించారు. వారు మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ అనేది ప్రభుత్వ ఉద్యోగులు ప్రతీ ఒక్కరి జీవితంలో ఒక మధురానుభూతి వంటిదన్నారు. మల్లేశం తన సర్వీసులో ఎంతో మంది ఉపాధ్యాయులను, విద్యార్థులను చూసి ఉంటారని, అవన్నీ ఆయన జీవితంలో మధుర జ్ఞాపకాలుగా నిలిచిపోతాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ రమేష్, మాజీ జెడ్పీటీసీ ముత్తాహర్ షరీఫ్, కౌన్సిలర్ మురళి, నాయకులు రమేష్‌నాయక్, సర్ఫరాజ్, దీపు, హెచ్‌ఎం గాలి శ్రీహరి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదతరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

● ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, జనవరి 31 : రోడ్డు ప్రమాదాలను నివారించడం అందరి బాధ్యత అని, మైనర్‌లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఎంఆర్‌పీ పెట్రోల్ పంపు వరకు రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గంటకు సుమారు 400 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యత వహిస్తూ తమ పిల్లలకు, చుట్టూ ప్రక్కల వారికి రోడ్డు భద్రతా నియమాలపై అవగాహనా కలిగించాలని సూచించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకున్నపుడే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాల వల్ల సంబవించే మరణాలలో ఎక్కువ శాతం ద్వి చక్ర వాహనదారులేనని, హెల్మెట్‌లు ధరించక పోవడమే ప్రధాన కారణమని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలిని, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని పేర్కొన్నారు. వాహనాల్లో పరిమితిని మించి ప్రయాణికులను తరలించొద్దని, త్రిబుల్ రైడింగ్ చేయవద్దని హెచ్చరించారు. అధికారులు, విద్యార్థులు, సిబ్బందితో రోడ్డు నిబంధనలు పాటించే విధంగా ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఆర్టీసీ అధికారి జోసెఫ్, డిపో మేనేజర్ భక్షినాయక్, మునిపల్ చైర్‌పర్సన్ మంజుల, అధికారులు, పాల్గొన్నారు.


ఎంఆర్‌పీ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మునిసిపల్ స్థలాల రక్షణ, పార్కుల అభివృద్ధికి నిధులు

●సాఫీగా తాండూరు కౌన్సిల్ సమావేశం

● పలు అభివృద్ధి పనులకు ఆమోదం

తాండూరు : జనవరి 31 : మున్సిపాలిటీకి చెందిన 12 ఖాళీ స్థలాల రక్షణ కోసం రూ. కోటి 77 లక్షల వ్యయంతో ఫెన్సింగ్ ఏర్పాటు, రూ. కోటి 80 లక్షల వ్యయంతో 9 మున్సిపాలిటీ పార్కుల అభివృద్ధికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బుధవారం తాండూరు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ స్వప్న పరిమళ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశంలో 24 అంశాలు చర్చకు రాగా 20 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారని అధికారులు తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో తుది దశలో ఉన్న భవన పనులు పూర్తి చేయడానికి రూ.కోటి 15 లక్షలు అంచనాలను కౌన్సిల్ ఆమోదించింది. 34వ వార్డులోని మున్సిపల్ ఖాళీ స్థలంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం చేపట్టుటకు కౌన్సిల్ పరిపాలన ఆమోదం తెలిపింది. పట్టణంలోని ఖాళీ స్థలాలు కబ్జా అవుతున్నాయని, అనుమతి లేని నిర్మాణాలు పెరిగిపోతున్నాయని కౌన్సిలర్లు అన్నారు. ఆక్రమణలను ఆపేందుకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.ఎన్‌టీఆర్ కాలనీలో ఖాళీ స్థలాలు కబ్జాకు గురయ్యాయని స్థానిక కౌన్సిలర్ మమత, గొల్ల చెరువు కబ్జా గురైందని, మినీ ట్యాంకు బండ్ పనులు జరుగలేదని కౌన్సిలర్ లలిత, వైస్‌చైర్‌పర్సన్ దీపా కోరారు. పార్కులలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కౌన్సిలర్‌లు మంకాల రాఘవేందర్, శోభారాణి కోరారు. శాంతినగర్ పార్కులలో జరుగుతున్న అక్రమాలపై దృష్టి పెట్టి అవసరమైతే కేసులు పెట్టాలని కౌన్సిలర్లు విజయదేవి, అబ్దుల్ రజాక్ అధికారులకు చెప్పారు. వీధిదీపాలు ఏర్పాటుకు, కుక్కల బెడద నిర్మూలనకు, సానిటేషన్ పనులు మెరుగు పర్చుటకు చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సభ్యులు కోరారు. 20వ వార్డులో ఖాళీ స్థలం రక్షణకు చర్యలు తీసుకోవాలని, పని చేస్తూ చనిపోయిన ఇద్దరు కార్మికుల కుటుంబ సభ్యులను పనిలోకి తీసుకోవాలని కౌన్సిలర్ సంగీత ఠాకూర్ కోరారు. వైస్‌చైర్‌పర్సన్ దీపా నర్సింహులు, కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా, మేనేజర్ నరేందర్‌రెడ్డి, డీఈఈ ఖాజాహుసెన్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ప్రజా ఎజెండాపైనే చర్చ జరగాలి .. ఎమ్మెల్యే

నాలుగేళ్ల ఏం జరిగిందనే విషయాన్ని పక్కన బెట్టి మిగిలిన ఎడాదికాలం అభివృద్ధి ఏ విధంగా చేద్దామనే విషయంపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ఎజెండా పైనే చర్చ జరగాలని కోరారు. కౌన్సిల్‌లో ప్రతిపక్షం, అధికారపక్షాలు ప్రజల పక్షం ఉండి పని చేయాలని చెప్పారు. బల్దియాలో రాజకీయాల వల్ల అభివృద్ధి కుంటు పడిందని అన్నారు.



బీఆర్ఎస్ హయాంలో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

●పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి

●జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి,

మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, జనవరి 31 : గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మాజీ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి గుర్తుచేశారు. బుధవారం మండలంలోని మాదాపురం, గూడూరు గ్రామాలలో రూ.2కోట్ల 66 లక్షల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం గూడూరులో ఏర్పాటు చేసిన సభలో సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి చెందిందని, విద్యారంగానికి మాజీ సీఎం కేసీఆర్ పెద్దపీట వేసినట్లు తెలిపారు. తమ పార్టీ నాయకులను విమర్శించడం మాని ప్రజలకు సంక్షేమ పథకాలను మంజూరు చేయడానికి కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, అంగన్‌వాడి పిల్లలకు పౌష్టికాహారం అందించాలని అధికారులకు సూచించారు. గూడూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల వద్దకు వెల్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి వైఎస్‌ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు మంద సాయిలు, పి.శ్రీలతశ్రీహరి, గోవర్ధన్, నరేందర్‌గౌడ్, ఎంపీటీసీలు ఎస్ ఎల్లారెడ్డి, కాకి రాములు, టి.ఇందిరదేవేందర్, నాయకులు మేఘనాథ్‌రెడ్డి, కాకి ధశరథ, లచ్చానాయక్, బాబయ్య, పారిజాత , బర్కం వెంకటేష్, కె.ప్రశాంత్‌చారి, కార్తీక్, దీక్షత్‌రెడ్డి, రామక్రిష్ణ, కె.విఘ్నేశ్వర్ రెడ్డి, కొండల్‌రెడ్డి, సామయ్య, డికెఆర్, ఎండి అలీ ఖాన్, నవీన్‌కుమార్, పాల్గొన్నారు.


కందుకూరు: మాదాపురంలో పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న తీగల అనితారెడ్డి, సబితాఇంద్రారెడ్డి,

'పల్లెప్రగతి'తో గ్రామాభివృద్ధి

మహేశ్వరం : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెప్రగతి కార్యక్రమాన్ని చేపట్టి గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కేసీతండాలో రూ. 40 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన మినీ ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహేశ్వరం నియోజకవర్గానికి రావాల్సిన రూ.170 కోట్ల అభివృద్ధి నిధులను నిలిపేశారని చెప్పారు. అభివద్ధి పనులకు సంబందించిన బిల్లులు సర్పంచులకు రావాల్సి ఉందని ప్రభుత్వం ఆలోచించి పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలన్నారు. ప్రతి తండాలో మినీ ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేసుకోవడానికి తనవంతు సహాయాన్ని అందిస్తానని చెప్పారు. ఫంక్షన్‌హాల్ ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఎంపీపీ ఆర్. సునిత అంద్యానాయక్, సర్పంచ్ మోతీలాల్, ఉపసర్పంచ్ లక్ష్మణ్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో అవకాశమివ్వాలి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఏనుగు జంగారెడ్డి


కందుకూరు: సీఎంకు వినతి పత్రం ఇస్తున్న జంగారెడ్డి

కందుకూరు, జనవరి 31: రాష్ట్రస్థాయి నామినేటెడ్, కార్పొరేషన్‌ల చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం నగరంలో వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను విద్యార్థిదశ నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తూ పార్టీ అభ్యున్నతికి కృషి చేసినట్లు సీఎంకు తెలిపినట్లు, తనకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని సీఎంను కోరినట్లు చెప్పారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో కలిసి నియోజకవర్గ ప్రజలకు చేరవేయడానికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు.

ఇష్టారాజ్యంగా పార్కింగ్‌తో ప్రమాదాలు

● పట్టించుకోని అధికారులు


సుగణ ప్యాక్టరీ దగ్గర రోడ్డుకిరువైపుల నిలిచి ఉన్న వాహనాలు

పరిగి, జనవరి 31 : పరిగి-షాద్‌నగర్ రహదారిలో లక్ష్మీదేవిపల్లి గేట్ దగ్గర ఉన్న సుగుణ స్టీల్ ప్యాక్టర్ దగ్గర భారీ వాహనాలు నిలుపడంతో వాహనదారులకు ఇబ్బందికంగా మారింది. పలువురు ఈ రోడ్డుకిరువైపులా లోడ్‌తో ఉన్న వాహనాలు నిలుపుతుండడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. అడ్డదిడ్డంగా వాహనాలను నిలుపడం వల్ల ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరగడం వల్ల గతంలో పలువురు చనిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. అయినా ఆ కంపెనీ యాజమాన్యం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పోలీసులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. కంపెనీ యజమాన్యం నిర్లక్ష్యం వల్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, కాషన్ బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదని చెప్పారు. ఈ ప్రాంతంలో రాత్రి సమయంలో డ్రైవింగ్ చేయడం ఇబ్బందిగా ఉంటుందని, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

● జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట్, జనవరి 31 : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిన్నకొల్కుంద గ్రామంలో సీసీరోడ్లు, కాలువల నిర్మాణం కోసం జడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్‌తో కలిసి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఐదేళ్ల క్రితం ఏర్పడ్డ ఈ గ్రామపంచాయతీకి మొదటి సర్పంచ్‌గా ఎన్నికైన సురేశ్ అభివృద్ధి కోసం కృషి చేశారని అభినందించారు. పదవీ కాలం నేటితో ముగుస్తుండడంతో ఇయనను సన్మానించారు. ఏఈ ప్రణిత, సుమిత్ర, సంగన్న, అశోక్, రాజు, నర్సింహులు, శివకుమార్, లక్ష్మయ్య, రాజయ్య, పాల్గొన్నారు.


చిన్నకొల్కుందలో శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్



రైతులకు ఉత్తమ సేవలు అందించాలి

●జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి


వికారాబాద్, జనవరి 31 : రైతులకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేయాలని కోటక్ మహేంద్ర బ్యాంక్ అధికారులకు జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలో కొటక్ మహేంద్ర బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా వ్యవసాయాదారిత ప్రాంతమని, ఇక్కడి రైతులను ప్రోత్సహించే విధంగా బ్యాంకర్ల సేవలు ఉండాలని అన్నారు. జిల్లాలో చిన్న చిన్న పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహికులను ప్రోత్సహించే విధంగా బ్యాంకు పనిచేయాలని చెప్పారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబుమోజెస్, రీజినల్ బిజినెస్ హెడ్ నటరాజ్ జోకే, క్లస్టర్ ఏరియా మేనేజర్ అనిల్‌పరిమి, జనరల్ మేనేజర్ రాఘవేంద్రగౌడ్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

● ఏసీపీ రాంచందర్‌రావు

శంషాబాద్‌రూరల్, జనవరి 31 : యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని శంషాబాద్ ఏసీపీ రాంచందర్ రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏసీపీ మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని ఇది దేశానికి మంచిది కాదని చెప్పారు. యువత డ్రగ్స్‌కు బానిస కావడం దురదృష్టకరమన్నారు. యువత కేరీర్‌పై దృష్టి సారించాలని, పెంచి పోశించిన తల్లిదండ్రులు వారిపై ఎంతో అశ పెట్టుకుంటారని చెప్పారు. చెడు వ్యసనాలకు బానిస అయితే భవిష్యత్ అందకారంలో పడుతుందని హెచ్చరించారు. పలువురు యువత చెడు మార్గలను అనుసరిస్తున్నారని చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని సీఐ శ్రీనాథ్ పిలుపునిచ్చారు. డ్రగ్స్‌పై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, పోలీస్ శాఖ కూడ అదే రీతిలో స్పందిస్తోందని చెప్పారు. డ్రగ్స్ అమ్మే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. కళాశాల సెక్రెటరీ ప్రభాకర్‌రెడ్డి, హనుమాన్‌రెడ్డి, ప్రిన్స్‌పాల్, ఎస్సై రాజ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏసీపీ రాంచందర్‌రావు

15 నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్

ఆమనగల్లు , జనవరి 31: శెట్టిపల్లి గ్రామంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహోత్సవాలను పురస్కరించుకుని ఫిబ్రవరి 15 నుంచి 17వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు ఎగిరిశెట్టి గోదాదేవిసత్యం తెలిపారు. టోర్నమెంట్‌కు సంబంధించిన గోడ పత్రికలను బుధవారం డిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ ఆమనగల్లులో ఆవిష్కరించారు. ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, యాట నర్సింహ్మ, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, జగన్, ఖాదర్‌ఖాద్రి, మానయ్య, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, రాములు, కృష్ణానాయక్, రవిందర్‌నాయక్, అలీమ్, నాజర్, ఫరీద్, జంతుక యాదయ్య, దావ ధనంజయ్య, ఖలీల్, ఖాదర్, రహీమ్ ఉన్నారు.


టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి


మూగజీవాలకు వ్యాధులు రాకుండా ముందస్తు టీకాలు

●పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కృష్ణయ్య


మాట్లాడుతున్న ఏడీ కృష్ణయ్య

కందుకూరు, జనవరి 31: మూగజీవాలకు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు టీకాలు వేయాలని, రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడి) మండల పశు వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పశు వైద్య కేంద్రాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించిన అనంతరం పశువైద్యాధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, మూగజీవాల కోసం ప్రవేశ పెడుతున్న పథకాలపై రైతులకు, గొర్లకాపర్లకు అవగాహన కల్పించాలని చెప్పారు. పశువైద్యాధికారులు డాక్టర్ రేవతి, డాక్టర్ షాహిన్‌షేక్, డాక్టర్ సంధ్యారాణి, సిబ్బంది వసంత, సామయ్య, జంగయ్య, రమేష్, మాధవి, కదిర్, అప్సర్, అంజనేయులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ పారిశుధ్య కార్మికురాలు అవార్డును అందుకున్న లక్ష్మి


మోదీతో పారిశుధ్య కార్మికురాలు లక్ష్మి

కొడంగల్ రూరల్, జనవరి 31 : జాతీయ స్థాయి ఉత్తమ పారిశుధ్య కార్మికురాలిగా కొడంగల్ మండలంలోని హస్నాబాద్ పంచాయతీ కార్మికురాలు లక్ష్మి అవార్డును అందుకున్నారు. మంగళవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నట్లు సర్పంచ్ బి.పకీరప్ప తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మిని సర్పంచ్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.





ఎలిమినేడులో జీపీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

ఇబ్రహీంపట్నం, జనవరి 31 : కాంగ్రెస్ పాలనలోనే అన్నివర్గాల సంక్షేమం సాధ్యమవుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలంలో పర్యటించారు. ఈసందర్భంగా ఎలిమినేడులో రూ.55 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్నిరంగాల్లో దోపిడీకి గురైందని ఆరోపించారు. వేలాది ఎకరాలను చెరబట్టి కేసీఆర్ కుటుంబం బాగుపడింది గానీ, నిరుపేదలకు ఒనగూరిందేమీలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనతో తెలంగాణకు మంచిరోజులు వచ్చాయని, ఆరు గ్యారెంటీలను అమలుచేసి పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఎలిమినేడులో సర్వే నెం.512 భూనిర్వాసితులకు న్యాయం జరిగేట్లు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి పర్యటన పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి స్వగ్రామం ఎలిమినేడులోని ఇంటివద్ద పోలీసుబందోబస్తు ఏర్పాటుచేశారు. ఎలిమినేడు సర్పంచ్ అశోక్ వర్ధన్‌రెడ్డి తన మద్దతుదారులతో కలిసి బీఆర్ఎస్‌ను వీడి ఎమ్మెల్యే మల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీడీవో వెంకటమ్మ, తహసీల్దారు అన్వర్, ఏఈ ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శేఖర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల అభివృద్ధే లక్ష్యం



రషీద్‌గూడలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్‌రూరల్ జనవరి 31 : అన్ని గ్రామాల అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, జడ్పీటీసీ నీరటి తన్వీరాజుతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కాచారం, పోశెట్టిగూడ, రషీద్‌గూడ, చౌదరిగూడ గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించారు. మొత్తం రూ.71లక్షలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కాచారంలో రూ.15 లక్షలతో నిర్మించిన నూతన మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే అన్ని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. వందలాది కోట్లతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తనాని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. వైస్ ఎంపీపీ నీలంనాయక్, పీఎస్‌సీఎస్ చైర్మన్లు బుర్కుంట సతీష్, దౌనకర్‌గౌడ్, సర్పంచ్‌లు రాణిరాజు, రాంగోపాల్, ఎంపీటీసీలు బుక్క ప్రవీణ్‌కుమార్, గౌతమి, మోహన్‌రావు, శ్రీకాంత్‌గౌడ్, శివాజీ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



చిన్నసోలిపేట్‌లో శంకుస్థాపన చేస్తున్న జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి, ఎంపీపీ ప్రశాంతీమహేందర్‌రెడ్డి

షాబాద్ జనవరి 31 : గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నసోలిపేట్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తామన్నారు. పదేళ్ల కాలంలో కేసీఆర్ నేతృత్వంలో గ్రామాలన్నీ అభివృద్ధి చెందాయన్నారు. ఏఎంసీ చైర్మన్ నర్సింగ్‌రావు, ఎంఈవో శంకర్‌రాథోడ్, సర్పంచ్ రమ్యకృష్ణ, ఎంపీటీసీ మామిడి లత, నాయకులు రాంచంద్రారెడ్డి, మహిపాల్‌రెడ్డి, గోపాల్ తదితరులు ఉన్నారు.

9 నుంచి చేవెళ్లలో క్రికెట్ పోటీలు

చేవెళ్ల, జనవరి 31 : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను పట్టణ కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో ఈనెల 9న ప్రారంభించనున్నట్లు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి తెలిపారు. కొండా వెంకట రంగారెడ్డి, కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేత జట్టుకు రూ.3 లక్షలు, రన్నర్ జట్టుకు రూ.2లక్షల ప్రైజ్‌మనీని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రకటించారని చెప్పారు. వివరాలకు 9849153278 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

రక్తదానంపై అవగాహన కల్పించాలి

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పాల్గొన్న కాసు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి, జనవరి 31: రక్తదానం పట్ల సమాజంలో మరింత అవగాహన కల్పించవలసిన బాధ్యత స్వచ్ఛంద సంస్థలపై ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆరోగ్యవంతులైన యువత రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. తలకొండపల్లి మండలం రామకృష్ణాపురం గ్రామంలో బుధవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై కాంగ్రెస్ జిల్లా నాయకుడు, శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ కాసు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, సర్పంచ్ ఎల్లమ్మ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సభ్యుడు అంజిరెడ్డితో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 50మంది రక్తదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజాభివృద్ధిని కాంక్షించి ప్రతిఒక్కరూ సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రజాపాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. కాగా, గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల మంజూరు చేయాలని శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే శంకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. లయన్స్‌క్లబ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ రమేశ్, సర్పంచ్ శ్రీశైలం, నాయకులు బాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

షాద్‌నగర్ రూరల్ : అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని, బడుగు, బలహీన వర్గాలకు చేయూతనివ్వడంతో అంబేద్కర్‌కు ఘనమైన నివాళి అర్పించినట్లవుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లిలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. కమ్మదనంలో దాత సహకారంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తపాలా భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచ్‌లు యాదమ్మ, నర్సింలు, దాత కేకే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన

కొత్తూర్ : మండల పరిధిలోని శేరిగూడబద్రాయపల్లి గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించతలపెట్టిన అంగన్‌వాడీ భవనానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ ప్రభాకర్, ఉపసర్పంచ్ బాల్‌రాజ్, షాద్‌నగర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వై.యాదయ్య, కో-ఆప్షన్ సభ్యుడు విజయ్‌పాల్‌రెడ్డి, నాయకులు, లింగారం సురేష్‌గౌడ్, ఎమ్మె వెంకటయ్య, మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో మెరుగైన వసతుల కల్పన



లింగరావుపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జనవరి 31: కాంగ్రెస్ ప్రజా పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించి ఇబ్బందులు తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తలకొండపల్లి మండలంలోని రాంపూర్, జంగారెడ్డిపల్లి, లింగరావుపల్లి, రామకృష్ణాపురం, దేవుని పడకల్ గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, అబివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, చేపట్టిన పనులకు రావాల్సిన బిల్లులను ఇప్పించాలని పలువురు సర్పంచ్‌లు ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. సర్పంచ్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, వరలక్ష్మీరాజేందర్‌రెడ్డి, ఎల్లమ్మ, శ్రీశైలం, వెంకట్రామ్‌రెడ్డి, రమేశ్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్‌గట్ల కేశవ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీకాంత్, ఎస్ఐ శ్రీకాంత్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జంతువుల పట్ల కరుణతో వ్యవహరించాలి

● విద్యార్థులకు పశువైద్యాధికారుల సూచన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రేవతి

కందుకూరు, జనవరి 31 : జంతువుల పట్ల కరుణతో వ్యవహరిస్తూ.. వాటికి తాగునీరు, ఆహారం అందించి హింసకు గురిచేయడం సరికాదని మండల పశువైద్యాధికారి డాక్టర్ రేవతి అన్నారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాచులూరు, లేమూరు పశువైద్యాధికారులు డాక్టర్ షాహిన్‌షేక్, డాక్టర్ సంధ్యారాణిలతో కలిసి నిర్వహించిన అవగాహన సదస్సులో రేవతి పాల్గొని మాట్లాడారు. పక్షులు, జంతువుల పట్ల ప్రేమ చూపించాలని, వృక్ష సంపదను పెంచడానికి విద్యార్థి దశ నుంచే మొక్కలను నాటడం అలవర్చుకోవాలన్నారు. కాలుష్య నివారణలో భాగంగా గాలిపటాలను ఎగురవేయకూడదన్నారు. పెంపుడు జంతువుకు క్రమం తప్పకుండా రోగనిరోధక టీకాలు వేయించాలని కోరారు. జంతువుల పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు, పౌరులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మురళీమోహన్, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట, జనవరి 31: నాటకీయ పరిణామాల మధ్య జీపీ బిల్డింగ్ ప్రారంభమైంది. ఆహ్వానితులు రాకపోవడంతో ఉదయం నుంచీ సాయంత్రం వరకు ప్రారంభంపై ఉత్కంఠ నెలకొంది. చివరకు గ్రామ పంచాయతీ కార్యవర్గం జీపీని ప్రారంభించడంతో వివాదానికి తెరపడినట్లయింది. మండలంలోని పాపిరెడ్డిగూడ జీపీ బిల్డింగ్‌ను దాదాపు రూ.20లక్షల జాతీయ ఉపాధిహామీ నిధులతో నిర్మించారు. సర్పంచ్‌ల పదవీకాలం ఈ నెల 31తో ముగుస్తుండడంతో సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి అదే రోజు ప్రారంభిచాలని భావించి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి ఏర్పాట్లు చేశారు. బుధవారం సర్పంచ్‌తో పాటు కార్యవర్గసభ్యులు ఆహ్వానితుల కోసం ఎదురుచూశారు. సాయంత్రం వరకు రాకపోవడంతో కార్యవర్గసభ్యులతో కలిసి సర్పంచ్ భవనాన్ని ప్రారంభించారు. ఉదయం నుంచి నెలకొన్న ఉత్కంఠకు తెరపడినట్లయ్యింది.

ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్లపై

అవిశ్వానికి అనుమతివ్వండి



తీర్మానప్రతిని అందజేస్తున్న సొసైటీ డైరెక్టర్లు

ఇబ్రహీంపట్నం, జనవరి 31 : ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్ టీకుల సుదర్శన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ క్యామ శంకర్‌లపై అవిశ్వాసం కోరుతూ పాలకవర్గ సభ్యులు బుధవారం జిల్లా కోఆపరేటివ్ అధికారికి తీర్మాన ప్రతిని అందజేశారు. కాగా, పీఏసీఎస్‌లో మొత్తం 13 డైరెక్టర్లు ఉండగా.. ఏడుగురు బీఆర్ఎస్ మద్దతుదారులు, కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు మద్దతుదారులున్నారు. చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాసం కోరుతూ మొత్తంగా 10 మంది డైరెక్టర్లు సుధాకర్‌రెడ్డి, జంగయ్య, మల్లయ్య, పోచయ్య తదితరులు అవిశ్వాసం కోరుతూ తీర్మానప్రతిపై సంతకాలు చేశారు. ఇందులో బీఆర్ఎస్ మద్దతుదారులైన నలుగురు డైరెక్టర్లుండడం గమనార్హం.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

షాబాద్, జనవరి 31 : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీపీ ప్రశాంతిమహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్‌లోని ప్రాథమిక ఆసుపత్రిని సందర్శించి, అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆసుపత్రిని అమెజాన్ కంపెనీ ప్రతినిధులు అన్ని హంగులతో సుందరీకరణ చేశారని తెలిపారు. డాక్టర్ శ్రీనివాస్, సిబ్బంది శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి చర్యలు : ఎంపీపీ

యాచారం, జనవరి 31 : మండల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, ఫార్మాసిటీ రద్దుకు కృషి చేస్తామని ఎంపీపీ సుకన్యబాషా, వైస్ఎంపీపీ కె.శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. బుధవారం కుర్మిద్దలో రూ.కోటీ 70లక్షల నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులను వారు ప్రారంభించారు. ప్రతీవార్డులో సీసీ రోడ్లు, భూగర్భడ్రైనేజీ పనులు చేపడతామన్నారు. గ్రామానికి మధ్యాహ్నం వేళ బస్సు నడిచేలా చొరవ తీసుకుంటామన్నారు. ఉప సర్పంచ్ నర్సింహ, నాయకులు తదితరులున్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న అంజయ్య

బీఆర్ఎస్ పథకాలు దేశానికే ఆదర్శం

చౌదరిగూడ, జనవరి 31: బీఆర్ఎస్ పథకాలు దేశానికే ఆదర్శమని, రాష్ట్ర అభివృద్ధిపై కేసీఆర్‌కు అవగాహన ఉందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వీరన్నపేట్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన పథకాలకు కేంద్రం అవార్డులు అందజేసిందని గర్తుచేశారు. పార్టీ ఓటమికి గల కారణాలను కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండలాధ్యక్షుడు హఫీజ్, రాములు, నర్సింగ్‌రావు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్ నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న టీజేఎస్ నాయకులు

చేవెళ్ల, జనవరి 31 : ప్రొఫెసర్ కోదండరాంను ఎమ్మెల్సీగా నియమించినప్పటికీ ప్రమాణస్వీకారాన్ని అడ్డుకుంటున్న కేసీఆర్ రాజకీయ ఎత్తుగడలను నిరసిస్తూ బుధవారం టీజేఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్లా రిబ్బన్లను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం టీజేఎస్ యూత్ అధ్యక్షుడు కౌకుంట్ల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి ప్రొఫెసర్ కోదండరాం చేసిన కృషి మరువలేదని చెప్పారు. కేసీఆర్ కక్షపూరితంగానే రాజకీయలు చేస్తున్నారని ఆరోపించారు. యూత్ మండలాధ్యక్షుడు మహేందర్, నాయకులు వెంకటేశ్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, రవి, శివకుమార్, కృష్ణచారి, గణేశ్, అమరేందర్, ఆదర్శ్ తదితరులున్నారు.

భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలి

మంచాల, జనవరి 31 : కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరిసిస్తూ కార్మికసంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న తలపెట్టిన భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఎం అనుబంధ వృత్తిసంఘాల రాష్ట్ర నేత పి.యాదయ్య పిలుపునిచ్చారు. భారత్‌బంద్‌కు సంబంధించి బుధవారం మంచాలలో సీఐటీయూ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీచేసి ప్రచారం నిర్వహించారు. రైతుసంఘం రాష్ట్రకమిటీ సభ్యుడు జంగయ్య, వ్యకాస రాష్ట్ర కమిటీసభ్యులు శ్యాంసుందర్, సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ, ఏర్పుల నర్సింహ, ఆవుల యాదయ్య, కాళ్ల జంగయ్య రాజు, నీళ్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి

కొందుర్గు, జనవరి, 31: విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలని మోటివేషనల్ స్పీకర్ సేవాకుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జీఎం పటేల్ గార్డెన్‌లో 6నుంచి 10వ తరగతి విద్యార్థులకు మూడు గంటలపాటు మోటివేషన్ క్లాస్ తీసుకున్నారు. విద్యార్థులకు పలు మెలకువలు నేర్పించారు. విద్యార్థులందరు ఇష్టపడి చదవాలని, పెద్దలను, తల్లిదండ్రులను గౌరవించాలని, తోటివారికి తోచిన సహాయ సహకారాలు అందించాలని, చిన్నతనంలోనే మానవతా విలువలు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో [illegible] సర్పంచ్ పెంటయ్య, వైస్ఎంపీపీ రాజేష్ పటేల్, మాణయ్య, శ్రీను, డి.సుదర్శన్‌లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

● చెరువులో ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన వైనం

● స్నేహితులే చంపారని కుటుంబ సభ్యుల ఆరోపణ



చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికి తీస్తున్న గ్రామస్తులు

మంచాల, జనవరి 31 : చెరువులో మునిగి ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మంచాల పోలీస్‌స్టేషన్ పరిధి పటేల్‌చెరువు తండా సమీపంలో జరిగింది. ఆరుట్ల గ్రామానికి చెందిన నూకం మహేష్(23) మంగళవారం తన స్నేహితులతో కలిసి వెళ్లి రాత్రికి వరకూ ఇంటికి తిరిగి రాలేదు. సాయంత్రం వీసీ తండా సమీపంలో చెరువులోకి వెళ్లినట్లుగా తన స్నేహితుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గాలింపు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నానికి గ్రామస్తుల సాయంతో చెరువులో నుంచి మహేష్ మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం అనంతరం భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లాలయ్య తెలిపారు. కాగా, మహేష్‌ను తన స్నేహితులే చంపి చెరువులో పడేసి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

కిరాణ దుకాణంలో చోరీకి విఫల యత్నం

కొత్తూర్, జనవరి 31: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న హరిఓం కిరాణ దుకాణంలో గుర్తుతెలియని దొంగలు చోరీకి విఫల యత్నం చేశారని పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని దుండగులు బుధవారం తెల్లవారుజామున దుకాణం షెట్టర్‌ను బద్దలుకొట్టి లోపలికి ప్రవేశించారని, నగదు దొరకకపోవడంతో దొంగలు వెనుతిరిగారని తెలిపారు. క్లూస్‌టీం పలు ఆధారాలను సేకరించారు. యాజమాని నేమిచంద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

బావిలో పడిన మహిళ.. తీవ్ర గాయాలు

మొయినాబాద్, జనవరి 31: ప్రమాదవశాత్తు బావిలో పడిన ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లికి చెందిన కుమ్మరి యాదమ్మ మంగళవారం రాత్రి టాయిలెట్ వెళ్లేందుకు ఇంట్లోంచి బయటకు వచ్చింది. ఇంతలో ఆమె ఇంటి ఎదుట ఉన్న పాడుబడిన బావిలో పడిపోయింది. యాదమ్మ తిరిగి ఇంట్లోకి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వచ్చి చూడగా బావిలోంచి అరుపులు వినిపించాయి. ఇరుగుపొరుగు వారిని పిలిచి తాడు సహాయంలో ఆమెను బావిలోంచి బయటకు తీశారు. తీవ్రగాయాలు కావడంతో యాదమ్మను నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. కాగా, ఆమె చెవికి తీవ్రగాయమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పాడుపడిన బావిని పూడ్చాలని ఎన్నిసార్లు చెప్పినా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. గతంలో సైతం పలువురు ఈ బావిలోపడి గాయాల పాలయ్యారని చెప్పారు. ఓ మహిళ మృతి చెందిందని తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

● విజయ డెయిరీ ఎండీ లక్ష్మికి పాడిరైతుల విన్నపం



వినతి పత్రం ఇస్తున్న పాడి రైతులు

చౌదరిగూడ, జనవరి 31: విజయ డైరీకి పాలు పోస్తున్న పాడిరైతులకు రాష్ట్ర ప్రభుత్వం గత కొన్ని నెలలుగా బిల్లులు చెల్లించడం లేదని, తక్షణమే బకాయిలు చెల్లించాలని పాల సెంటర్ల అధ్యక్షులు విజయ డైరీ ఎండీ చిట్టెం లక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు బుధవారం షాద్‌నగర్ పాల శీతలీకరణ పరిధిలోని జిల్లేడ్ చౌదరిగూడ మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు వెంకట్‌నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో విజయడైరీ ఎండీ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. దాంతో ఆమె మాట్లాడుతూ పాడి రైతులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే ఎన్నో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పాల బిల్లుల బకాయిలను వారంలో చెల్లిస్తామని తెలిపినట్లు వారు తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని తెలిపినట్లు చెప్పారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వెంకటేష్, రాము, మల్లేష్, అంజనేయులు, గోపాల్‌రెడ్డి, శేఖర్, రాందాస్, రాములు, అంజిరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతర కృషి



పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి


శంకర్‌పల్లి, జనవరి 31 : మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చైర్‌పర్సన్ విజయలక్ష్మీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలో 3 వార్డులో రూ.8లక్షలతో చేపట్టిన అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అన్నివార్డుల్లో చాలావరకు అభివృద్ధి పనులు పూర్తి చేశామని తెలిపారు. కౌన్సిలర్ రాధా బాలకృష్ణ, మోహన్ గౌడ్, మోహన్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు సరికాదు

● సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు బాబురావు


చౌదరిగూడ, జనవరి 31: బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు సరికాదని, జిల్లేడ్ చౌదరిగూడ సన్నాసులెవరో ప్రజలకు తెలుసని, చల్లివేంద్రంపల్లి రాజు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా ఏదేదో మాట్లాడుతున్నారని సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు బాబురావు జిల్లేడ్ చౌదరిగూడ కాంగ్రెస్ నాయకులకు కౌంటర్ ఇచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండలాధ్యక్షుడు హఫీజ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. మంగళవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ఇతర నాయకులు మాట్లాడుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కించపరిచే విధంగా మాట్లాడామని విలేకర్ల సమావేశంలో మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. ఎమ్మెల్యే అంటే అందరికీ గౌరవమేనని ఎమ్మెల్యేను ఎక్కడా కూడా కించపరిచే విధంగా మాట్లాడలేదన్నారు. ఎక్కడైనా కించపరిచినట్లు ఉంటే రికార్డులు చూపించాలన్నారు. సీనియర్ నాయకులు బంగారు రాములు మాట్లాడుతూ పాలక పక్షంలో ఉన్న నాయకులు హుందాతనంగా ఉండాలన్నారు. సర్పంచ్ వెంకటస్వామి, ఎంపీటీసీ రాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంచి పనులతోనే ప్రజల్లో గుర్తింపు



సన్మానం పొందిన సర్పంచులతో వైస్ ఎంపీపీ, రాజేష్ పటేల్, అధికారులు

కొందుర్గు/చేవెళ్ల/కడ్తాల్, జనవరి, 31: ప్రజా ప్రతినిధులు తమ హయాంలో ఆయా గ్రామాల్లో చేసిన పనులతోనే గుర్తింపు వస్తుందని వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ అన్నారు. సర్పంచుల పదవీ కాలం ముగుస్తుండడంతో, బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం లోని సమావేశపు మందిరంలో అన్ని గ్రామాల సర్పంచులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సర్పంచులు, అధికారులు తదితరులున్నారు. ఐదేళ్లు సర్పంచ్‌గా గ్రామస్తుల సహకారంతో గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేశామని సర్పంచ్‌ల సంఘం చేవెళ్ల మండలాధ్యక్షుడు, మల్కాపూర్ సర్పంచ్ శేరి శివారెడ్డి అన్నారు. మల్కాపూర్ జీపీ కార్యాలయంలో సర్పంచ్, ఉప సర్పంచ్ ఎస్డీ జాఫర్‌తో పాటు వార్డుసభ్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కడ్తాల్ మండల పరిధిలోని కొండ్రి గాని బోడుతండాలో పంచాయతీ పాలకవర్గానికి ఘన సన్మానం లభించింది. సర్పంచ్ సేవ్యానాయక్, ఉపసర్పంచ్ శ్రీనునాయక్, వార్డు సభ్యులను సన్మానించారు.



చేవెళ్ల : మల్కాపూర్‌లో సన్మానం పొందిన పాలకవర్గం



కడ్తాల్ : పాలకమండలిని సన్మానిస్తున్న తండావాసుల

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలి

కడ్తాల, జనవరి 31: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే సమాజం వేగవంతంగా అభివృద్ధి సాధిస్తుందని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మహిళల సంక్షేమం, రక్షణ, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని కోరారు. మండలంలోని మైసిగండి గ్రామంలో జడ్పీ నిధుల నుంచి మంజూరైన రూ.5లక్షలతో నిర్మించే మహిళ సంఘం భవన నిర్మాణానికి బుధవారం ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, సర్పంచ్ తులసీరాంనాయక్‌తో కలిసి దశరథ్ నాయక్ శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి మరో రూ.5లక్షలు మంజూరు చేయిస్తానని దశరథ్ నాయక్ హామీ ఇచ్చారు. బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, నాయకులున్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

ఆమనగల్లు, జనవరి 31: సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమని సర్పంచ్ రుద్రాక్ష పార్వతమ్మ అన్నారు. నల్లవారిపల్లిలో ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని బుధవారం వార్డుసభ్యులు, ఎంపీటీసీ కృష్ణమ్మగాలయ్యతో కలిసి సర్పంచ్ ప్రారంభించారు. ఐదేళ్ల పదవీ కాలంలో నల్లవారిపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచి ఆదర్శంగా నిలిపామన్నారు. అభివృద్ధికి సహకరించిన ప్రతీ ఒక్కరికి ఈ సందర్భంగా సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్తంగా..

● **శంకర్‌పల్లి** : ప్రజలకు నాణ్యమైన కట్టడాలను నిర్మించి ఇవ్వడమే తమ సంస్థ లక్ష్యమని నిఖిల కన్‌స్ట్రక్షన్ అండ్ డెవలపర్స్ యాజమాని శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం సింగాపూర్‌లో నిర్వహించిన సదస్సులో తన సంస్థకు ఏషియన్ బిసినెస్ కాన్‌కేవ్-2024 అవార్డు వచ్చినట్లు తెలిపారు.

● **మాడ్గుల** : నల్లవారిపల్లి గ్రామానికి చెందిన తానయ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ సీనియర్ నాయకులు నూదిని శివరామ్‌రెడ్డి, నాయకుడు గౌని మల్లేష్‌గౌడ్‌లు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎరకలి కాటంగౌడ్, మధు, తదితరులు పాల్గొన్నారు.

● **కడ్తాల్** : అన్మాస్‌పల్లిలో జీపీ కార్యాలయ ప్రహరీ ని ర్మాణ పనులను సర్పంచ్ శంకర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే కోటా నుంచి రూ.15లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు.

● **తలకొండపల్లి** : వెల్జాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు రాచమళ్ళ భాస్కర్, పరందాములు మాతృమూర్తి యాదమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. బుధవారం మృతురాలి కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయం చేశారు.

● **కొందుర్గు** : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, చెర్కుపల్లి వేంకటేశ్వరాలయం నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైనట్లు కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసశర్మ తెలిపారు. ధర్మకర్తల మండలిలో చైర్మన్‌తో పాటు నలుగురు సభ్యులు ఉంటారని, ఇందులో ఒకరు బీసీ(స్త్రీ లేదా పురుషుడు), ఒకరు ఎస్సీ(స్త్రీ లేదా పురుషుడు), ఒకరు మహిళ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 31 బుధవారం నుంచి 19 ఫిబ్రవరి 2024 వరకు దరఖాస్తులను హైదరాబాద్‌లోని దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్-రంగారెడ్డి కార్యాలయంలో అందజేయాలన్నారు.

● **షాబాద్** : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సంత్ శ్రీ ఆశారామ్ జీ ఆశ్రమం నిర్వాహకులు పరమేశ్వర్ అన్నారు. ఆశ్రమం ఆధ్వర్యంలో భరతనాట్యంలో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతులందజేశారు. కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యయులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

● **తలకొండపల్లి** : పడకల్ గ్రామానికి చెందిన బండగల రామస్వామి ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి బుధవారం రామస్వామిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. చికిత్స నిమిత్తం రామస్వామికి ప్రభాకర్‌రెడ్డి రూ.3వేలు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ రూ. 2వేల ఆర్థిక సహాయం అందజేశారు.

● **చేవెళ్ల** : ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని న్యాలట సర్పంచ్ సీహెచ్ లక్ష్మీ సత్యనారాయణ అన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బాత్రూముల్లో టైల్స్, ప్లంబర్ వర్క్ తదితర పనులు చేపట్టేందుకు పీఏసీఎస్ డైరెక్టర్ నరేందర్, విజయకాంత్, అభినందన్‌రెడ్డిలు రూ.45వేలు అందించారు. సర్పంచ్, హెచ్ఎం రజిని, టీచర్లు దాతలను సత్కరించారు.

● **షాబాద్** : నెహ్రూ యువ కేంద్రం అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా దాదె మహేష్‌ను నియమించినట్లు కేంద్ర క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాగూర్ ప్రకటించారు. ఈమేరకు బుధవారం నియామకపత్రాన్ని జిల్లా అధికారి ఐజయ్య చేతుల మీదుగా మహేష్ అందుకున్నారు.